కాల్పుల విరమణను చరిత్ర క్షమించదు

మొదటిపేజీ తరువాయి...

ధ్వజమెత్తారు. 1948 నుంచి 2025 వరకూ ఏ చారిత్రక ఘటనను చూసినా ఇది తెలుస్తుందన్నారు. మొత్తంగా 'ఆపరేషన్ సిందూర్'కు మోదీ ప్రభుత్వం ఓ లాజిక్‌లేని ముగింపును ఇచ్చి వ్యూహాత్మక తప్పిదం చేసిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు జాతీయ మీడియా ఇండియాటుడే, టైమ్స్‌నౌతో పాటు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో చెల్లానే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ఏమన్నారంటే..

సంబంధం లేని ట్రంప్ రావడమేంటి?

'శనివారం ఉదయం పాకిస్థాన్ సైన్యం సరిహద్దు వైపు కదిలిందని వార్తలు వచ్చాయి. భారత సైన్యం కూడా పూర్తి అప్రమత్తతతో ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో యుద్ధం తథ్యం అనేస్థాయిలో వాతావరణం వేడెక్కింది. కానీ అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణపై వెలువడిన ఆ ప్రకటన కూడా ఇటు భారత్, అటు పాకిస్థాన్ నుంచి వచ్చిందా అంటే.. అదీ లేదు. ఈ వ్యవహారానికి సంబం ధం లేని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'కాల్పుల విరమణ'పై ముందుగా ప్రకటించారు. ఆ తర్వాత దీనిపై భారత్-పాక్ ప్రకటన చేశాయి. ఎందుకు?' అని బ్రహ్మ చెల్లానీ ప్రశ్నించారు.

ఇదో విఫల కథ

'అమెరికా ఒత్తిడికి తలొగ్గి మోదీ ప్రభుత్వం ఈ విరమణ ప్రకటన చేసినట్టు అర్థమవుతున్నది. ఎన్డీయే సర్కారు అలా ఎందుకు చేసింది? అమెరికా ఒత్తిడికి తలొగ్గి విరమణ ప్రకటన ఎలా చేస్తారు? పహల్గాం దాడిలో 26 మంది అమాయకుల మరణాలకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' అనే గంభీరమైన పేరుతో తీసుకొచ్చిన ఈ ఆపరేషన్ కథ ఓ మూడు రోజుల విఫల కథగా మిగిలిపోయింది కదా. మోదీ ప్రభుత్వం ఎటువంటి లాజికల్ ఎండింగ్ ఇవ్వకుండా దీన్ని ముగించడం వ్యూహాత్మక తప్పిదమే' అని బ్రహ్మ చెల్లానీ మండిపడ్డారు.

ఒప్పుకోవడానికి కారణమేంటి?

'ప్రస్తుత పరిస్థితులు భారత్‌కు చాలా అనుకూలంగా ఉన్నాయి. పాకిస్థాన్ సైనిక శక్తి డొల్లతనం బయటపడింది. పాకిస్థాన్ భారీ సంఖ్యలో డ్రోన్లు, మిస్సైళ్లు ప్రయోగించగా, భారత్ సమర్థవంతంగా అడ్డుకున్నది. ఇదే సమయంలో భారత సైన్యం పరిమిత సంఖ్యలో మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించి లక్ష్యాలను ఛేదించగలిగింది. దీంతో పాకిస్థాన్ వైమానిక దళం డొల్లతనం బయటపడింది. వారి సైనిక శక్తి గురించి ఇన్నాళ్లు చేసుకొన్న ప్రచారం ఉత్తదేనని తేలింది. పాక్‌పై ఇలా స్పష్టంగా భారత సైన్యం పై చేయి సాధిస్తున్న సమయంలో కాల్పుల విరమణకు మోదీ ప్రభుత్వం ఎందుకు ఒప్పుకున్నది?' అని బ్రహ్మ చెల్లానీ ప్రశ్నించారు.

చరిత్రను తిరగేస్తే అన్ని ఇంతేగా

'విజయం అంచున ఉన్నప్పుడు వెనక్కి తగ్గడం అనేది సుదీర్ఘ భారత రాజకీయ ప్రస్థానానికి కొత్తేంకాదు. విజయం వాకిలి వరకు వెళ్లి తిరిగి రావడం మనకు ఓ అలవాటుగా మారిపోయింది. చరిత్ర నుంచి భారత్ పాఠాలు నేర్చుకోలేదు కాబట్టే.. అదే పునరావృతం అవుతున్నది. ఇవే తప్పులు జరుగుతున్నాయి. 1948లో కశ్మీర్ అంశం, 1954లో టిబెట్ వివాదం, 1960లో సింధు జలాలు, 1972లో పాకిస్థాన్ నుంచి ఎలాంటి లబ్ధి పొందకుండానే చర్చలు ముగించడం, 2021లో ఎలాంటి బేరసారాలు చేయకుండానే వ్యూహాత్మకంగా కీలకమైన కైలాశ్ పర్వతాలను ఖాళీ చేయడం, లద్దాఖ్‌లో చైనా నిర్దేశించిన బఫర్ జోన్లకు అంగీకారం తెలుపడం.. ఇప్పుడు కాల్పుల విరమణకు ఒప్పుకోవడం.. ఇవన్నీ నిజమే కదా!' అని బ్రహ్మ చెల్లానీ అన్నారు.

చరిత్ర క్షమించదు

'పాకిస్థాన్.. కాల్పులు జరిపినా, మిస్సైళ్లు ప్రయోగించినా అవేమీ పట్టించుకోకుండా మోదీ ప్రభుత్వం అసలేమీ జరుగలేదన్నట్టు కాల్పుల విరమణకు అంగీకరించింది. ఎందుకు? మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని చరిత్ర ఎన్నటికీ క్షమించదు' అని బ్రహ్మ చెల్లానీ అన్నారు.

వేరే చర్చ జరుగుతున్నది

''ఆపరేషన్ సిందూర్' సమాధానాల కంటే ప్రశ్నలనే ఎక్కువగా మిగిల్చింది. కాల్పుల విరమణ ప్రకటన తర్వాత 'ఆపరేషన్ సిందూర్'కు బీజం వేసిన పహల్గాం దాడి గురించి గానీ, పాక్ సీమాంతర ఉగ్రవాదం గురించి గానీ ఎక్కడా చర్చకు జరుగట్లేదు. ఈ విషయానికి అసలేం సంబంధంలేని కశ్మీర్ అంశం మళ్లీ తెరమీదకు వస్తున్నది. 'కశ్మీర్'పై మధ్యవర్తిత్వం వహిస్తానని ట్రంప్ ప్రకటించడమే దీనికి ఉదాహరణ. ట్రంప్ అనే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూ ఆక్రమణ అనేది ఎంతో ఇష్టం. గ్రీన్‌లాండ్, పనామా కెనాల్, గాజా ఆక్రమణ అంటూ ఇలా రోజూ ఆయన ప్రకటనలను టీవీల్లో చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయన కశ్మీర్‌పైనా మాట్లాడారు. అయితే, భారత్ ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదాన్ని మాత్రం ట్రంప్ ప్రస్తావించలేదు. అలాంటి వ్యక్తికి తలొగ్గి మోదీ ప్రభుత్వం ఎందుకు విరమణ ప్రకటన చేసింది??' అంటూ చెల్లానీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ఎవరీ చెల్లానీ?

బ్రహ్మ చెల్లానీ ప్రఖ్యాత జియో స్ట్రాటజిస్ట్, రచయిత. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డులో ఈయన సభ్యులు. ఢిల్లీలోని సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్‌లో ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. భారత అణుసిద్ధాంతం ఆవిష్కర్తల్లో ఈయన కీలక పాత్ర పోషించారని 1999లో న్యూయార్క్ టైమ్స్ ప్రత్యేకంగా ప్రశంసించింది. హార్వర్డ్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, జాన్ హాప్కిన్స్ వంటి ప్రఖ్యాత యూనివర్సిటీల్లో ఈయన కీలక ప్రసంగాలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ఈయన ఆర్టికల్స్ ప్రచురితమయ్యాయి.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అమ్ముడుపోయారా: శివసేన (యూబీటీ)

కాల్పుల విరమణ అవగాహన విషయంలో మోదీ సర్కారు వ్యవహరించిన తీరుపై శివసేన (యూబీటీ) విరుచుకుపడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వం వహించడం పై ఆగ్రహం వ్యక్తంచేసింది. అసలు ట్రంప్‌కు ఏం హక్కు ఉందని ఆయన మధ్యవర్తిత్వం వహించారని ప్రశ్నించింది. భారత సార్వభౌమాధికారం విషయంలో మోదీ సర్కారు రాజీ పడిందని ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికారిక పత్రిక 'సామ్నా'లో ఎడిటోరియల్ ప్రచురితమైంది. 'ట్రంప్ ఒక బిజినెస్‌మ్యాన్. మహాత్మాగాంధీ, మార్టిన్ లూథర్‌కింగ్ లాగా ఆయన అంతర్జాతీయ శాంతిదూత కాదు. మధ్యవర్తిత్వం వహించే అధికారం ట్రంప్‌కు ఎవరిచ్చారు? ఆయన భారత సార్వభౌమాధికారాన్ని కొనుగోలు చేశారా? అదే జరిగితే ఏం ప్రతిఫలంగా అది జరిగింది? కశ్మీర్ విషయంలో మూడో వర్గం మధ్యవర్తిత్వం ఉండరాదనే సిమ్లా ఒప్పందాన్ని మోదీ సర్కారు ఉల్లంఘించింది. దేశ సరిహద్దులో భద్రత సరిగ్గా లేదు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు దేశంలోకి ఎలా ప్రవేశించారు? మళ్లీ ఎలా తప్పించుకున్నారు? వారి ఆచూకీ ఇప్పటికీ ఎందుకు కనుక్కోలేదు?' అని ప్రశ్నించింది. బీజేపీ రాజకీయ నాటకాల్లో పడొద్దని, సరిహద్దుల్లో ప్రాణాలు కోల్పోతున్న సైనికుల విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ప్రజలను శివసేన (యూబీటీ) కోరింది.

బాధ్యత నుంచి ప్రధాని తప్పించుకోలేరు: పార్లేకర్

ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాల విషయంలో మోదీ ప్రవర్తించిన తీరుపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ప్రారంభించే ముందు మోదీ అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులతో, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో వరుస చర్చలు జరిపారు. కానీ.. కాల్పుల విరమణ నిర్ణయాన్ని మాత్రం సొంతంగా తీసుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అఖిలపక్షం నిర్వహించలేదు.. కనీసం విపక్షాలకు సమాచారం కూడా ఇవ్వలేదు. చివరికి అందుబాటులో ఉన్న మంత్రులతో క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించకుండా.. మోదీ పూర్తి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ సమావేశం నిర్వహించి దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలని సర్వత్రా డిమాండ్లు వెల్లువెత్తుతుంటే.. మోదీ మాత్రం ఆదివారం రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించడంపైనా అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తాను మాట్లాడాలనుకున్న విషయాలను మాత్రమే చెప్పి తప్పించుకోవడానికే వీడియో సందేశం ఇచ్చారని మండిపడుతున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జర్నలిస్టు, రచయిత, రాజకీయ విశ్లేషకుడు రాజు పార్లేకర్ ఏకంగా మోదీ ప్రసంగాన్ని 'నాన్సెన్స్'గా అభివర్ణించారు. 'ప్రధాని ఏకపక్షంగా టీవీల్లో జాతిని ఉద్దేశించి ప్రసంగించడం పార్లమెంట్ సమావేశాలకు ప్రత్యామ్నాయం కాదు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రతీసారి ఇలా తనకు నచ్చినట్టు ఏకపక్షంగా, స్వేచ్ఛగా మాట్లాడి తన బాధ్యతల నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగ విరుద్ధమైన ప్రధాని వ్యవహారశైలిని ప్రతిపక్షం ఎండగట్టాలి. పార్లమెంట్ సమావేశాలకు ప్రత్యామ్నాయంగా టీవీల్లో జాతిని ఉద్దేశించి ప్రసంగించేంత ఎమర్జెన్సీ పరిస్థితులు ఇప్పుడు దేశంలో లేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(3) ప్రకారం.. లోక్‌సభకు మంత్రిమండలి సమష్టిగా బాధ్యత వహిస్తుంది. ప్రధాని మోదీ పార్లమెంట్‌కు జవాబుదారీగా ఉండాలి. పార్లమెంట్‌కు సమాధానం చెప్పాలి. ఆయన తనకు నచ్చినట్టు ఏదో ఒకటి మాట్లాడాలి. తన మనసులో గూడు కట్టుకున్న భావోద్వేగాలను పార్లమెంట్‌లో బయటపెట్టాలి. అవసరమైతే ఏడ్వ వచ్చు కూడా. 140 కోట్ల మంది భారతీయుల తరపున ప్రశ్నించేందుకు, అవసరమైతే సాయం చేసేందుకు ప్రతిపక్షం ఉంది. మనది ప్రజాస్వామ్యం, నిరంకుశత్వం కాదు. రాత్రి 8 గంటలకు జరిగే నాన్సెన్స్‌ను ఆపాలి' అని రాజు పారులేకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని వెంగుర్లాలో జన్మించిన రాజు.. సామ్నా, మహారాష్ట్ర టైమ్స్, లోక్‌సత్తా, మహానగర్, లోక్‌ప్రభ సహా అనేక పత్రికల్లో వ్యాసాలు రాశారు. పలు పుస్తకాలు కూడా రాశారు.

విద్యావంతుడే పాలకుడు కావాలి

పాలనాపరంగా భారత్ అత్యంత సంక్లిష్ట దేశం

- విద్యావంతులే సొంతంగా నిర్ణయాలు తీసుకోగలరు
- ఇతరుల సహాయం లేకుండా చర్చించగలరు
- స్వయంగా నిర్ణయాలూ తీసుకోగలరు
- కాల్పుల విరమణ విషయంలో మోదీ సర్కారు తీరును ఎండగడుతున్న మేధావులు
- మోదీ విద్యావంతుడు కాదని పరోక్షంగా చెప్పిన బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి

ఢిల్లీ, మే 12: కాల్పుల విరమణ విషయమై మోదీ సర్కారు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరీ ముఖ్యంగా ద్వైపాక్షిక అంశమైన కశ్మీర్ విషయంలో మూడో వర్గానికి అవకాశం ఇవ్వడం, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడం, అమెరికా అధ్యక్షుడు ఏకపక్షంగా సోషల్‌మీడియాలో కాల్పుల విరమణను ప్రకటించడంపై దేశవ్యాప్తంగా విద్యావేత్తలు, మేధావులు, నిపుణులు మండిపడుతున్నారు. పాలనాపరంగా భారత్ సంక్లిష్ట దేశమని, విద్యావంతుడైన రాజకీయ నాయకుడే ఈ దేశానికి పరిపాలకుడిగా ఉండాలని న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త దేవి సోషల్‌మీడియాలో అభిప్రాయపడగా.. బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి స్పందించారు. భారత ప్రధానుల్లో లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు మాత్రమే విద్యావంతులని, చంద్రశేఖర్ విద్యావేత్తలను గౌరవించేవారని సుబ్రమణ్య స్వామి తెలిపారు. పరోక్షంగా ప్రధాని మోదీ విద్యావేత్త కాదని ఆయన పేర్కొన్నారని ఆయన రిప్లైను ఉద్దేశించి పలువురు నెటిజన్లు చర్చించుకున్నారు. 'భారత్‌కు అత్యంత విద్యావంతుడైన నాయకుడు అవసరం. అలాంటి నాయకుడే బ్యూరోక్రాట్ల అవసరం లేకుండా స్వయంగా ఇతరులతో చర్చించగలరు. అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలరు. స్వయంగా నిర్ణయం కూడా తీసుకోగలరు. పాలనాపరంగా భారత్ ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన దేశం. చదువు లేకుండానే ఎదిగిన వ్యక్తుల ప్రస్థానాలు బాలీవుడ్ స్క్రిప్ట్‌లుగా మాత్రమే బాగా పనికొస్తాయి' అని న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త దేవి పేర్కొన్నారు. దీనిపై సుబ్రమణ్యస్వామి స్పందిస్తూ.. హిందూ సంప్రదాయం ప్రకారం ఏదైనా చర్యను చదివిన తర్వాత రాజు (రాష్ట్రపతి) దానిపై సంతకం చేసేవారు. ఆ తర్వాత బ్రాహ్మణులు (ప్రధానమంత్రి) ప్రతిపాదిత చర్యను అమలు చేసేవారు. కాబట్టి, ప్రధానమంత్రి బాగా చదువుకున్నవారై ఉండాలి. భారత ప్రధానుల్లో లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు మాత్రమే విద్యావేత్తలు. మాజీ ప్రధాని చంద్రశేఖర్ విద్యావేత్తలను గౌరవించేవారు' అని పరోక్షంగా మోదీని దెప్పిపొడిచారు.

తనకు తానే అపహాస్యం చేసుకున్న మోదీ!

అప్పట్లో కాల్పుల విరమణకు మన్మోహన్ యత్నిస్తే మోదీ విమర్శలు: కార్టూనిస్ట్ మంజుల్

ఢిల్లీ, మే 12: మోదీ సర్కారు పాక్‌తో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రముఖ కార్టూనిస్ట్ మంజుల్ సెటైర్లు వేశారు. కాల్పుల విరమణ అవగాహన కుదుర్చుకున్న 3 గంటలకే దాయాది దేశం దాన్ని ఉల్లంఘించడాన్ని చూస్తుంటే 14 ఏండ్ల కిందట తాను వేసిన ఓ కార్టూన్ గుర్తుకొస్తున్నదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు నాటి కార్టూన్‌ను ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘనను చూస్తుంటే 2011 ఫిబ్రవరిలో నేను వేసిన ఈ కార్టూన్ గుర్తుకొస్తున్నది. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాక్‌తో కాల్పుల విరమణకు ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నించగా.. మోదీ ఆయనను విమర్శించారు. కానీ, ప్రధాని మోదీ ఇప్పుడు పాక్‌తో కాల్పుల విరమణకు అవగాహన కుదుర్చుకొని తనను తానే అపహాస్యం చేసుకున్నారు. ఒకటికి మించి ఎక్కువ పవర్ సెంటర్స్ ఉన్న పాకిస్థాన్‌తో ఒప్పందం చేయడం అత్యంత క్లిష్టమైనది. ఈ 14 ఏండ్లలో ఏం మారలేదు' అని మంజుల్ ట్వీట్ చేశారు.

140 కోట్ల మంది గౌరవ ప్రతిష్టలతో ఆటలా?

గత ప్రభుత్వాలు దౌత్యపరంగా, యుద్ధంలోనూ విజయాలు సాధించాయి • మీరు అవకాశాన్ని వృథా చేశారు: భోజ్‌పురి సింగర్ నేహా సింగ్

ఢిల్లీ, మే 12: మోదీ సర్కారు 140 కోట్ల మంది గౌరవప్రతిష్టలతో ఆటలాడిందని భోజ్‌పురి ఫోక్ సింగర్ నేహా సింగ్ రాథోడ్ మండిపడ్డారు. యుద్ధం చేయాలని ప్రభుత్వానికి ఎవరు చెప్పారని, యుద్ధ వాతావరణ సృష్టించి మధ్యలో కాడి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ఒక వీడియో పోస్టు చేశారు. 'దోమలను చంపేందుకు ఆలౌట్ సరిపోతుంది. ఇల్లు మొత్తం పొగ పెట్టాల్సిన అవసరం లేదు. సూదితో అయ్యే పనికి సూదినే వాడాలి, కత్తిని కాదు. అలాగే అన్నింటికి యుద్ధమే చేయాల్సిన అవసరమే లేదు. దౌత్యపరంగా కూడా కొన్ని పనులు అవుతాయి. యుద్ధం అనేది అంతిమ మార్గం మాత్రమే. యుద్ధమంటేనే అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయని అర్థం. 26/11 ముంబయి దాడికి పాల్పడిన ఉగ్రవాదులందరినీ అప్పటి ప్రభుత్వం చంపేసింది. సజీవంగా పట్టుకున్నవాళ్లను కూడా ఉరితీసింది. అన్ని సాక్ష్యాధారాలతో పాక్‌ను అందరి ముందు నగ్నంగా నిలబెట్టింది. ఫలితంగా పాకిస్థాన్ ఒంటరైంది. పాకిస్థాన్ అంటే ఏమిటో అందరికీ తెలిసొచ్చింది. బిర్యానీ తినాలని అప్పటి ప్రధానికి ఆహ్వానం రాలేదు. మోదీజీ వెళ్లినట్టుగా ఆయన పాకిస్థాన్‌కు వెళ్లలేదు. కానీ, ఇప్పటి సంగతి చూసుకుంటే.. మన దేశాన్ని యుద్ధం చేయాలని ప్రభుత్వానికి ఎవరూ చెప్పలేదు. మాక్ డ్రిల్స్‌తో యుద్ధ వాతావరణాన్ని సృష్టించమని కూడా చెప్పలేదు. మనపై దాడి చేసిన ఉగ్రవాదులందరినీ పట్టుకోవడం ప్రధానిగా మీ బాధ్యత. సాక్ష్యాధారాలను సేకరించి, దర్యాప్తు చేసి, వారిని శిక్షించి మరోసారి పాక్‌ను నడిరోడ్డుపై నగ్నంగా నిలబెట్టాలి. అప్పుడు పాక్‌కు ఎవరు మద్దతుగా నిలుస్తారో చూడాల్సింది. కానీ, మీరు ఏం చేశారు. చక్కటి అవకాశాన్ని వృథా చేశారు. దేశమంతా మీ వెంటే ఉంది. అయినా మీరు దేశాన్ని ఇబ్బందుల్లోకి నెట్టివేశారు.

ముగిసిన సమరం!

- దేశ ప్రజానీకం ఆశించినవి సాధించకుండానే వార్ ఎండ్
- తెరుచుకున్న 32 ఎయిర్‌పోర్టులు
- బోర్డర్‌లో బలగాల తగ్గింపు

న్యూఢిల్లీ, మే 12: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన సమరం దేశ ప్రజానీకం ఆశించినవేవీ సాధించకుండానే అర్ధాంతరంగా ముగిసింది. పాక్‌పై మన బలగాలు పైచేయి సాధించినప్పటికీ అమెరికా ఒత్తిడితో మోదీ సర్కారు కాల్పుల విరమణకు అంగీకరించడంపై దేశవ్యాప్తంగా విస్మయం వ్యక్తమవుతున్నది. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించి సీజ్‌ఫైర్‌కు ఒప్పించినట్టు ట్రంప్ బహిరంగంగానే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

32 ఎయిర్‌పోర్టులు రీఓపెన్

భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలతో ఉత్తర, వాయువ్య ప్రాంతాలలో మూసివేసిన 32 ఎయిర్‌పోర్టులను తిరిగి తెరిచినట్టు భారత విమానయాన నియంత్రణ సంస్థ సోమవారం ప్రకటించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ కుదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. శ్రీనగర్, ఛండీగఢ్, అమృత్‌సర్‌లో విమానాల రాకపోకలు ప్రారంభమైనట్టు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) స్పష్టం చేసింది. ప్రయాణికులు విమానాల స్టేటస్ కోసం ఆయా సంస్థల ఎయిర్‌లైన్స్‌లను నేరుగా లేదా వారి వెబ్‌సైట్‌ల ద్వారా వివరాలను తెలుసుకోవాలని ఏఏఐ సూచించింది.

స్వస్థలానికి తిరిగివస్తున్న బారాముల్లా జిల్లా వాసులు



పూంఛ్ జిల్లాలో పాక్ కాల్పుల్లో గాయపడిన ఓ స్థానికుడిని పరామర్శిస్తున్న జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

సరిహద్దుల్లో బలగాల తగ్గింపు

సరిహద్దుల్లో బలగాలను తగ్గించేందుకు భారత్-పాకిస్థాన్‌లు అంగీకరించాయి. ఈ మేరకు రెండు దేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్(డీజీఎంవో)లు నిర్ణయానికి వచ్చినట్టు ఇండియా టుడే వెల్లడించింది. ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు కాల్పులు జరపొద్దని.. దూకుడుగా వ్యవహరించొద్దని సోమవారం సాయంత్రం 5 గంటలకు హాట్‌లైన్ ద్వారా జరిగిన సమావేశంలో నిర్ణయించినట్టు ఓ ప్రకటన తెలిపింది. అయితే మధ్యాహ్నం 12 గంటలకు ఈ సమావేశం జరగాల్సి ఉండగా.. సాయంత్రం 5 గంటలకు జరిగింది. మరో వైపు పాకిస్థాన్ శనివారం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించగా.. 19 రోజుల తర్వాత తొలిసారిగా ఆదివారం రాత్రి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. ఏప్రిల్ 23 నుంచి మే 6 వరకు ఎల్‌వోసీ వెంబడి తుపాకీల మోత వినిపించగా.. మే 7 నుంచి 11 వరకు డ్రోన్లు, వైమానిక దాడులతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. అయితే సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని సహించేది లేదని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని సంబంధిత వర్గాలు పీటీఐకి తెలిపాయి.

సరిహద్దుల్లో పరిస్థితులు సాధారణం

వారం రోజులుగా ఉత్తర భారతదేశంలోని సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు సోమవారం చల్లబడ్డాయి. డ్రోన్లు, బాంబుల మోత లేకపోవడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నట్టు పీటీఐ కథనం వెల్లడించింది. నాలుగు రోజుల పాటు భారత్-పాక్‌ల మధ్య మిలటరీ చర్యలు కొనసాగగా.. న్యూఢిల్లీ, ఇస్లామాబాద్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందంతో పరిస్థితి మారింది. లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ) సరిహద్దు ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు, బాంబుల మోత పరిస్థితుల నేపథ్యంలో స్థానికులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. కాగా సోమవారం వారు తిరిగి తమ ప్రాంతాలకు రావడం కనిపించింది. కొన్ని చోట్ల భద్రతా బలగాలు మందుపాతరలను తొలగించినట్టు ఆర్మీ అధికారులు తెలిపారు. యూరీ సెక్టార్‌లోని కమల్‌కోట్‌కు చెందిన అర్షద్ అహ్మద్ మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు. పాకిస్థాన్ మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించదని భావిస్తున్నామని తెలిపారు. ఏవైనా అనుమానస్పద వస్తువులు కనిపిస్తే వాటిని ముట్టుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని యూరీ ఎమ్మెల్యే సజ్జద్ షఫీ స్థానికులను కోరారు. ఏవైనా అనుమానస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాల ప్రజలు ఇప్పుడే ఇండ్లలోకి రావొద్దని తాము ఇంకా పూర్తి స్థాయిలో మందుపాతరలను తొలగించలేదని అధికారులు ఆదివారం స్థానికులను హెచ్చరించారు. పంజాబ్‌లోని మార్కెట్లు ప్రజలతో నిండిపోయి కనిపించాయి.. అయితే సరిహద్దుల్లోని స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు మాత్రం తెరుచుకోలేదు. సోమవారం ఉదయం పలు చోట్ల టీ స్టాళ్లు, షాపుల వద్ద జనాలు తిరుగుతూ కనిపించారు. జమ్ముకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని ఇండియన్ ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది.

మళ్లీ కనిపించిన అనుమానిత డ్రోన్లు

- జమ్ముకశ్మీర్‌లోని సాంబాలో గుర్తించామన్న రక్షణ వర్గాలు

న్యూఢిల్లీ, మే 12: జమ్ముకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో అనుమానిత డ్రోన్లు మళ్లీ కలకలం రేపాయి. సోమవారం రాత్రి డ్రోన్లు కనిపించినట్టు రక్షణ వర్గాలు తెలిపాయని ఇండియా టుడే వెల్లడించింది. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతల వేళ మరోసారి డ్రోన్లు కలకలం రేపగా.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ డ్రోన్లు కనిపించినట్టు ఏఎన్‌ఐ వీడియో షేర్ చేసింది. సాంబలో మే 8న, జమ్ము, అక్నూర్, నాగ్‌రోటా, అమృత్‌సర్, పఠాన్‌కోట్ ప్రాంతాల్లో సైతం కొన్ని రోజుల క్రితం డ్రోన్లు కనిపించడంతో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. భారత్-పాక్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత డ్రోన్లు కనిపించడం మరోసారి చర్చనీయాంశమైంది.

భారత డ్రోన్ల దాడిలో ఏడుగురు మృతి

- పాకిస్థాన్ అధికార వర్గాల వెల్లడి

లాహోర్, మే 12: భారత్ జరిపిన డ్రోన్ల దాడిలో ఏడుగురు మృతి చెందడంతో పాటు ఆరుగురికి గాయాలైనట్టు పాకిస్థాన్ అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు సోమవారం పీటీఐ వెల్లడించింది. పంజాబ్ ప్రావిన్స్‌లోని గుజరాత్‌లో ఈ దాడులు జరిగినట్టు తెలిపింది. పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ.. శనివారం పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్, చినియట్, పాక్ పట్టాన్, ఖరియన్, షేకుపుర, జలపూర్ జట్టన్‌లో డ్రోన్ దాడులు జరిగినట్టు తెలిపారు. పాక్‌లోని భారత సరిహద్దు గ్రామాల్లో జరిపిన దాడుల్లో ఏడుగురు మృతి చెందగా.. ఆరుగురికి గాయాలైనట్టు వెల్లడించారు. లాహోర్‌కు 400 కి.మీ. దూరంలో ఉన్న పంజాబ్‌లోని రహీమ్ యార్ ఖాన్ జిల్లా లో షేక్ జయాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఎయిర్‌బేస్)పై మిసైల్ దాడితో భారీ నష్టం జరిగినట్టు చెప్పారు. యూఏఈ అధ్యక్షుడి కోసం నిర్మించిన రాయల్ లాంజ్ ధ్వంసమైనట్టు తెలిపారు.

ఇది యుద్ధాల యుగం కాదు

- ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను శిక్షించాం
- పాక్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం
- ఇకపై పాకిస్థాన్‌తో ఉగ్రవాదం, పీవోకేపైనే చర్చలు
- జాతినుద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): ఇది యుద్ధాలు చేసే యుగం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను శిక్షించామని, పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పామన్నారు. భారత సైన్యం సాధించిన ఈ విజయాన్ని దేశంలోని ప్రతి మహిళకు అంకితం చేస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోదీ సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సైన్యం సత్తా ప్రతి ఒక్కరికి తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో సాయుధ బలగాలకు, నిఘా సంస్థలకు, శాస్త్రవేత్తలకు ప్రతి భారతీయుడి తరపున సెల్యూట్ చేస్తున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని చూసి దేశంతో పాటు ప్రపంచం నివ్వెరపోయిందన్నారు. ఈ దాడి వ్యక్తిగతంగానూ తనను ఎంతో బాధించిందన్నారు. ఉగ్రవాదులను శిక్షించేందుకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు. దీంతో కచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను, శిక్షణ శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. బహావల్పూర్, మురిద్కే వంటి కీలకమైన ఉగ్రవాద కేంద్రాలపై దాడులు చేసినట్టు చెప్పారు. మన దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక ఉగ్రదాడులకు ఈ క్యాంపులతో సంబంధాలు ఉన్నట్టు తెలిపారు. భారత సైన్యం దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు హతమైనట్టు చెప్పారు. మన దేశంలోని ఆడబిడ్డల గౌరవానికి భంగం కలిగిస్తే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో ఉగ్రవాదులందరికీ కచ్చితమైన సందేశం ఇచ్చామన్నారు. 'ఆపరేషన్ సిందూర్ ఒక పేరు మాత్రమే కాదు.. భారత్ ప్రతీకారం ఎంత తీవ్రంగా ఉంటుందో మేన ప్రపంచం మొత్తం చూసింది' అని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉగ్రవాదంపై భారత విధానానికి ఆపరేషన్ సిందూర్ ఒక పాలసీగా మారిందన్నారు. ఇది యుద్ధాల కాలం కాదని.. ఇదే సమయంలో ఉగ్రవాదానికి కూడా కాలం కాదని స్పష్టం చేశారు.

పాకిస్థాన్ గజగజ వణికిపోయింది

భారత్ జరిపిన దాడులతో పాకిస్థాన్ తీవ్ర ఒత్తిడిలో కూరుకపోయిందన్నారు. అసహనంలో మన దేశంపైకి డ్రోన్లు, మిస్సైళ్లతో దాడి చేసి తీవ్ర తప్పిదం చేసిందన్నారు. వాటిని మన రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా గాలిలోనే అడ్డుకున్నదన్నారు. మన సైన్యం ఉగ్రవాద శిబిరాలపై దాడి చేస్తే, పాక్ సైన్యం మన విద్యాసంస్థలు, గురుద్వారాలు, ఆలయాలు, మిలిటరీ బేస్‌లు, పౌరుల ఇండ్లపై దాడులు చేసిందన్నారు. మన దేశ సరిహద్దులపై పాక్ దాడులు చేస్తే.. మన సైన్యం పాకిస్థాన్‌లోని వైమానిక స్థావరాలపై దాడులు చేసి, తీవ్ర నష్టం కలిగించిందన్నారు. భారత్ ప్రతీకార దాడులతో పాక్ గజగజ వణికిపోయిందన్నారు. విదేశాల సాయం కోరిందన్నారు. భారత డీజీఎంవోను సంప్రదించిందని, ఇకపై తమ భూభాగంలో ఉగ్రవాద కార్యకలాపాలు జరగకుండా చూస్తామని, సైనిక దురాక్రమణలకు పాల్పడబోమని హామీ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో భారత సైన్యం తన దాడులను ఆపిందని చెప్పారు. ఇది తాత్కాలికం మాత్రమేనని, లక్ష్మణ రేఖ దాటనంత వరకే పాకిస్థాన్‌ను ఉపేక్షిస్తామన్నారు. రాబోయే రోజుల్లో పాక్ చేసే ప్రతి తప్పిదానికి తగిన స్థాయిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. త్రివిధ దళాలు, బీఎస్‌ఎఫ్, పారామిలిటరీ యూనిట్లు హై అలర్ట్‌లోనే ఉన్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో మన దేశం సొంతంగా అభివృద్ధి చేసిన ఆయుధాల సామర్థ్యం కూడా ప్రపంచానికి తెలిసి వచ్చిందన్నారు. ఇకపై అణ్వాయుధాలను బూచిగా చూపితే భయపడేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌తో పాక్ నిజస్వరూపం ప్రపంచానికి తెలిసిందని, ఉగ్రవాదుల అంత్యక్రియల్లో ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారని గుర్తు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నదని, భవిష్యత్తులో ఇది వారికి భస్మాసుర హస్తంగా మారుతుందన్నారు. ఒకవేళ పాకిస్థాన్ మనుగడ సాగించాలంటే, ఉగ్రవాదాన్ని సొంతంగా అంతం చేయాలన్నారు. సొంత గడ్డపై ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం తప్ప శాంతికి మరో మార్గం లేదన్నారు. ఇకపై పాకిస్థాన్‌తో ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించి మాత్రమే చర్చలు జరుగుతాయన్నారు.

పాక్‌కు మేం ఆయుధాలు పంపుతలేం

ఇంటర్నెట్‌లో ప్రచారాన్ని కొట్టిపారేసిన చైనా

బీజింగ్, మే 12: పాకిస్థాన్‌కు ఆయుధ సామగ్రితో కూడిన కార్గో విమానాలను పంపినట్టు వస్తున్న వార్తలను చైనా కొట్టిపారేసింది. ఇలాంటి అసత్య ప్రచారం చేసేవారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు చైనా రక్షణశాఖ, ఆర్మీ సోమవారం ప్రకటనలు విడుదల చేశాయి. వై-20 మిలటరీ ట్రాన్స్‌పోర్ట్ విమానం ద్వారా పాకిస్థాన్‌కు చైనా ఆయుధ సంపత్తిని పంపిస్తున్నదంటూ ఇంటర్నెట్‌లో సమాచారం వ్యాప్తిలో ఉంది. చైనా ఆర్మీ కూడా ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్న వివరాల స్క్రీన్‌షాట్స్‌పై రూమర్స్ అని పేర్కొంటూ విడుదల చేసింది. మరోవైపు చైనాలోని భారత విదేశాంగ కార్యాలయం కూడా ఓ ప్రకటన విడుదల చేసింది.

17 మందికి 'సిందూర్' పేరు

ఖుషీనగర్, మే 12: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. అయితే 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తిగా ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీనగర్‌లో పుట్టిన 17 మంది ఆడ శిశువులకు 'సిందూర్' అని పేరు పెట్టారు. ఈ మేరకు సోమవారం పీటీఐ కథనం వెల్లడించింది.